క్లుప్తంగా

మైనార్టీ రుణాలకు ఇంటర్వ్యూలు

నెన్నెల: మైనార్టీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఈ నెల 14, 15వ తేదీల్లో గ్రామసభల ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వరలక్ష్మి తెలిపారు. 14న నెన్నెల, కోణంపేట, కుశ్నపల్లి, మైలారం గ్రామపంచాయతీ అభ్యర్థులకు, 15న గుండ్ల సోమారం, నార్వాయిపేట, మెట్‌పల్లి, చిత్తాపూర్, ఆవుడం, కొత్తూర్ గ్రామాల మైనార్టీలకు వారి గ్రామపంచాయతీల్లో గ్రామసభలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అభ్యర్థులు రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న ఆన్‌లైన్ దరఖాస్తు ఫారాం, విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డుతో పాటు బ్యాంకు ఖాతా పుస్తకం వెంట తీసుకురావాలన్నారు.

బోనాల సందడి



పట్నాల వద్ద భక్తుల సందడి

చెన్నూర్‌రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకొని మండలంలోని కత్తెరసాల గ్రామంలోని శ్రీ మల్లిఖార్జున స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలిరాగా, ఆలయ ఆవరణ కిక్కిరిసింది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ ఆవరణలో బోనాలు పోసి తీపి పదార్థాలతో స్వామి వారికి నైవేద్యం పెట్టారు. ఒగ్గు పూజారులు పట్నాలు వేశారు. శివ సత్తుల పూనకాలతో ఆలయ ఆవరణ మారుమోగింది.

గోదావరి పుష్కరఘాట్ పరిశీలన



పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజయ్య

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని కాలేజీ రోడ్డులో ఉన్న గోదావరి పుష్కరఘాట్‌ను ఆదివారం మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ రాజయ్య పరిశీలించారు. ఈ నెల 18వ తేదీన మహాశివరాత్రి సందర్భంగా భక్తులు పవిత్ర స్నానాలు చేసేందుకు పెద్ద ఎత్తున తరలి రానుండడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు ప్రకాశ్‌నాయక్, అంకం నరేశ్, నాయకులు రవీందర్‌రావు, తాజ్ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్



విజేత జట్టుకు నగదు అందిస్తున్న నిర్వాహకులు

మందమర్రిరూరల్: మండలంలోని సారంగపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన డా.బీఆర్ అంబేద్కర్ రూరల్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఆదివారం హోరాహోరీగా జరిగిన ఫైనల్‌పోటీలో జెండా వెంకటాపూర్ జట్టుపై నార్లపూర్ జట్టు గెలిచింది. నార్లాపూర్ జట్టుకు రూ.15 వేలు, జెండా వెంకటాపూర్ జట్టుకు రూ.5వేలు ప్రైజ్‌మనీతో పాటు షీల్డ్‌లను నిర్వాహకులు అందించారు. కార్యక్రమంలో ఫిరోజ్, ప్రవీణ్, క్రీడాకారులు ఉన్నారు.

సాక్షి సినిమాలు



మంచిర్యాల	
శ్రీనివాస	: అమిగోస్
వెంకటేశ్వర	: వేద
జెమిని సినిమా స్క్రీన్ 1	: పఠాన్/రైటర్ పద్మభూషణ్/చెడ్డీగ్యాంగ్
జెమిని సినిమా స్క్రీన్ 2	: అమిగోస్/టైటానిక్
లక్సెట్టిపేట	
మహానంద	: అమిగోస్
జన్నారం	
రాఘవేంద్ర	: అమిగోస్
చెన్నూర్	
శ్రీశ్రీనివాస	: అమిగోస్
బెల్లంపల్లి	
రామకృష్ణ	:అమిగోస్
బాలాజీ	: పఠాన్
సీసీసీ	
దేవి	: పఠాన్
తిరుమల	: అమిగోస్

- మంచిర్యాలటౌన్

పైప్‌లైన్‌కు ఏడాది.. నీటి సరఫరా ఎప్పుడో?

ట్రయల్‌రన్ చేయకుండానే బిల్లు చెల్లించిన అధికారులు | నీటి సరఫరాలో అన్నీ లీకేజీలే | మళ్లీ సింగరేణి ఆధ్వర్యంలో వెల్డింగ్ పనులు

బెల్లంపల్లి: తాండూర్ మండలం మాదారం టౌన్‌షిప్‌లో కార్మికులకు తాగునీటిని సరఫరా చేయడం కోసం చేపట్టిన పైపులైన్ పనుల తీరు అస్తవ్యస్తంగా తయారైంది. కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించగా తూతూ మంత్రంగా చేపట్టడంతో పనుల్లో నాణ్యత లేమి ఉన్నట్లు విమర్శలు వస్తున్నాయి. మరో పక్క అసంపూర్తిగా ఉన్న పైపులైన్ పనులను సింగరేణి అధికారులు కార్మికులతో చేపడుతున్నారు. ఏడాదికాలం గడిచినా పైపులైన్ పనులు నేటికీ పూర్తి కాలేదు. ట్రయల్ రన్ చేస్తున్న ప్రతిసారి ఎక్కడికక్కడ పైపు నుంచి నీరు లీకేజై పైకి ఎగజిమ్ముతోంది. పాత పైపులతో పైపులైన్ పనులు చేపట్టడంతో సమస్యలు ఏర్పడుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఎండాకాలం వచ్చినా పైపులైన్ పనులు సాగ... దీస్తుండటంతో తాగునీరు సరఫరా చేయని ప్రతికూల పరిస్థితులు ఏర్పడుతున్నాయి.



పైపులను బిగిస్తున్న సింగరేణి కార్మికులు



పైపులైన్ లీకై రోడ్డుపై పారుతున్న నీరు

3.5 కిలోమీటర్ల దూరం వరకు పైపులైన్..

బెల్లంపల్లి ఏరియా మాదారం టౌన్‌షిప్‌లో నివాసం ఉంటున్న సింగరేణి కార్మిక కుటుంబాలకు తాగునీటిని సరఫరా చేయడం కోసం మూసివేతకు గురైన మాదారం వన్ ఇంక్‌లైన్ గని వద్ద నుంచి 3.5కిలో మీటర్ల వరకు పైపులైన్ పనులను ప్రతిపాదించారు. ఇందుకోసం రూ.6.75 లక్షలు మంజూరు చేసి కాంట్రాక్టర్‌కు పనులను అప్పగించారు. పనుల నిర్వహణ కాంట్రాక్టర్‌కు అప్పగించగా పైపులైన్‌లను సింగరేణి సరఫరా చేసింది. ఏడాదిక్రితం పనులు అప్పగించగా ఆ కాంట్రాక్టర్ మొక్కుబడిగా చేపట్టి మమ అనిపించినట్లు కార్మికులు పేర్కొంటున్నారు. 2012లో అండర్ గ్రౌండ్ నుంచి పైపులైన్‌ను ఏర్పాటు చేశారు. ఆ పైపులైన్ కూడా లీకేజీ అవుతుండటంతో అనివార్యంగా ఓపెన్ పైప్‌లైన్‌ను ప్రతిపాదించడం గమనార్హం. ఓపెన్ పైపులైన్ పనులను పూర్తి చేసిన కాంట్రాక్టర్ ట్రయల్ రన్ నిర్వహించకున్నా కంపెనీ అధికారులు మాత్రం బిల్లు చెల్లించినట్లుగా కార్మికులు ఆరోపిస్తున్నారు. అశ్రద్ధగా తోచిన రీతిలో పైపులైన్ పనులు చేపట్టడంతోనే నేటికీ నీటి సరఫరా చేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. మరో మార్గం లేక పాత అండర్ గ్రౌండ్ పైపులైన్ ద్వారా కంపెనీ క్వార్టర్లకు నీటిని సరఫరా చేస్తున్నారు.

లీకవుతున్న పైపులైన్..

ఉపరితలం నుంచి ఏర్పాటు చేసిన పైపులను సరిగ్గా అనుసంధానించక పోవడంతో ట్రయల్ రన్ నిర్వహిస్తున్న ప్రతిసారి నీటి లీకేజీ జరుగుతోంది. పైపులు ఊడి నీరు రోడ్లపై వరదలై ప్రవహిస్తోంది. నీటి ఉధృతికి గుంతలు ఏర్పడుతున్నాయి. దీంతో ప్రస్తుతం జాయింట్ల వద్ద వెల్డింగ్ పనులను సింగరేణి కార్మికులతో చేయిస్తున్నారు. గడిచిన మూడు రోజుల నుంచి పైపులైన్ పొడువునా వెల్డింగ్ పనులు జరుగుతున్నాయి. పైపులైన్ విస్తరణ పనులను కాంట్రాక్టర్‌కు కట్టబెట్టి, ఏడాది తర్వాత వెల్డింగ్ పనులను కార్మికులతో నిర్వహిస్తుండటం సంబంధిత అధికారుల పని తీరుకు అద్దం పడుతోంది. సరైన క్రమపద్ధతిలో పైపులైన్ పనులు చేపట్టకుండా సంబంధిత అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. పైపులైన్ పనులను ఏడాదికాలం పైబడి నుంచి సాగదీస్తుండటంతో కార్మికులు విసుపోతున్నారు. ఇంకెన్నాళ్లకు పూర్తి చేస్తారోనని చర్చించుకుంటున్నారు.

వెల్డింగ్ పనులు అప్పగించలేదు

పైపులైన్ విస్తరణ పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించాం. పైపుల వెల్డింగ్ పనులను మాత్రం కంపెనీ తరపున కార్మికులతో నిర్వహిస్తున్నాం. పాత పైపులతో పైపులైన్ ఏర్పాటు చేయించాం. పైపులు ఊడిపోకుండా వెల్డింగ్ పనులు జరుగుతున్నాయి. కాంట్రాక్టర్ సరిగ్గానే పనులు నిర్వహించారు. పైపులను అస్తవ్యస్తంగా ఏర్పాటు చేయలేదు. ఓ పార్టు బిల్లు కూడా కాంట్రాక్టర్‌కు చెల్లించాం.

- సతీష్‌బాబు, డీవైజీఎం(సివిల్), బెల్లంపల్లి ఏరియా

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ప్రజలకు అన్ని రకాల సంక్షేమ పథకాలతో పాటు, అభివృద్ధి సాధ్యం అవుతుందని మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని రెండో వార్డు గాంధీనగర్‌లో హాత్ సే హాత్ జోడో అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం గడపగడపకూ తిరిగి కాంగ్రెస్ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ సళ్ల మహేశ్, నాయకులు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని పడ్తనపల్లిలో ప్రేమ్‌సాగర్‌రావు ఆధ్వర్యంలో హాత్ సే హాత్ జోడో యాత్రను చేపట్టారు. పార్టీ జెండా ఆవిష్కరించి యాత్ర ప్రారంభించగా గ్రామంలో గడపగడపకూ వెళ్తూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ఇంటింటా క్యాలెండర్లను పంపిణీ చేశారు. ప్రచారంలో మండల అధ్యక్షుడు తోట రవి, మాజీ సర్పంచ్ అంకం కృష్ణమూర్తి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు ఒడ్డె రాజమౌళి, ఎంపీటీసీలు డేగ బాపు, ఒడ్డె బలరాజ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాట	రూ.20
పచ్చిమిర్చి	60
చిక్కుడు కాయ	60
బీరకాయ	90
వంకాయ	60
కాకరకాయ	60
బెండకాయ	60
అలసంద	40
దొండకాయ	70
సొరకాయ	20
ఆకుగోబి	60
పూగోబి	70
క్యారెట్	50
క్యాప్సికం	90
పాలకూర	40
తోటకూర	40
ములక్కాయ	100

- మంచిర్యాలఅగ్రికల్చర్



'హామీలు విస్మరించిన బీఆర్ఎస్'

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు జరిపించడం విషయంలో బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన హామీని విస్మరించిందని టీడీపీ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సంజయ్‌కుమార్ ఆరోపించారు. మున్సిపాలిటీలోని సమస్యలు తెలుసుకోవడానికి ఆదివారం మార్కెట్‌లోని హనుమాన్ టెంపుల్‌లో ప్రత్యేక పూజ నిర్వహించి పాదయాత్ర చేపట్టారు. పలు కాలనీలు తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు తప్పడంలేదని, గతంలో రెండు ఎన్నికల్లో కూడా మున్సిపాలిటీకి ఎన్నికలు జరిపిస్తామని సీఎం హామీ ఇచ్చినా నెరవేర్చలేదని, సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల ఊసే లేదని, సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగి ఆర్థిక దోపిడి ఎక్కువైందని మండిపడ్డారు. ఇప్పటికైనా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని, లేకుంటే ప్రజల మద్దతుతో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. పార్టీ నాయకులు పెద్దపల్లి సత్యనారాయణ, సమ్మయ్య, షరీఫా, శంకర్, సంపత్, సురేందర్, రామస్వామి ఉన్నారు.



మాట్లాడుతున్న సంజయ్‌కుమార్

సెర్ప్ ఉద్యోగులకు భద్రత!

పాతమంచిర్యాల: గ్రామీణాభివృద్ధి సంస్థ సెర్ప్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు పేస్కేల్ ప్రకటించి వారికి ఉద్యోగ భద్రత కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఉద్యోగుల్లో ఆనందం వ్యక్తమౌతోంది. 2001లో ఉమ్మడి రాష్ట్రంలో నాటి టీడీపీ ప్రభుత్వం సెర్ప్ ఏర్పాటు చేసింది. 22ఏళ్ల క్రితం వివిధ హోదాల్లో నియాకమైన ఉద్యోగులు, చాలీచాలని వేతనాలతో ఎలాంటి భద్రత లేకుండానే ఉద్యోగాలు చేస్తున్నవారికి ఎట్టకేలకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. సెర్ప్‌లో ఎంఎస్ సీసీలు, కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు, ఏపీఎంలు, ఏపీడీలు మహిళా సంఘాల అభివృద్ధి కోసం పని చేస్తున్నారు. ఏళ్లుగా తక్కువ జీతంతో పని చేస్తున్న వీరికి 2008లో కాంగ్రెస్ ప్రభుత్వం హెచ్‌ఆర్ పాలసీని కల్పించి వారికి బాసటగా నిలిచింది. అప్పటి నుంచి ఉద్యోగ భద్రత కోసం పోరాటాలు చేస్తూనే ప్రభుత్వాలకు విన్నవిస్తూ వస్తున్నారు. ఏళ్లుగా తాము పడిన శ్రమను తెలంగాణ ప్రభుత్వం గుర్తించిందని, ఎట్టకేలకు తమ జీవితాలకు భరోసా దక్కిందని జిల్లాలోని సెర్ప్ ఉద్యోగులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 118మందికి లబ్ధి..

సెర్ప్‌లో జిల్లా వ్యాప్తంగా 118మంది ఉద్యోగులు పనిచేస్తుండగా ఎంఎస్ కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు 46మంది, కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు 47మంది, ఏపీఎంలు 20మంది, డీపీఎంలు నలుగురు, ఏపీడీ ఒకరు ఉన్నారు. వీరందరినీ ఆయా హోదాల్లో శాశ్వత ఉద్యోగులుగా గుర్తిస్తే తమ శ్రమకు గుర్తింపు దక్కుతుందని ఉద్యోగులు పేర్కొంటున్నారు. అయితే ఆర్థిక మంత్రి ప్రకటన చేశారే తప్పా, ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదని గ్రామీణాభివృద్ధి అధికారులు తెలిపారు.



హర్షం వ్యక్తం చేస్తున్న సెర్ప్ ఉద్యోగులు

2003లో ఎంబీకేగా చేరాను



డిగ్రీ అర్హతతో వెలుగు పథకంలో మాస్టర్ బుక్ కీపర్‌గా ఉద్యోగంలో చేరాను. అప్పుడు నా జీతం రూ.1200 ఎలాంటి అలవెన్సులు లేకుండానే పని చేశాను. ప్రస్తుతం కమ్యూనిటి కో ఆర్డినేటర్‌గా పని చేస్తున్నాను. ప్రస్తుతం నాకు రూ.28వేల జీతం వస్తుంది. పే స్కేల్ వర్తింపజేస్తే జీతం పెరిగే అవకాశముంది.

- ఆంజనేయులుగౌడ్, ఉమ్మడి జిల్లా గుర్తింపుసంఘం అధ్యక్షుడు

2003 నుంచి ఉద్యోగం చేస్తున్నా..



2003సంవత్సరంలో కమ్యూనిటి కో ఆర్డినేటర్‌గా ఉద్యోగంలో చేరాను. అప్పుడు నా నెల జీతం రూ.3900 ఉండేది. పోరాటాల ఫలితంగా హెచ్ పాలసీ తర్వాత జీతాలు పెరిగాయి. ప్రస్తుతం నా జీతం రూ.35వేలు వస్తుంది.

- పంజాల ప్రకాష్‌గౌడ్, సెర్ప్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు

కమ్యూనిటీ కో ఆర్డినేటర్‌గా చేరాను



2002లో కమ్యూనిటీ కో ఆర్డినేటర్‌గా ఉద్యోగంలో చేరాను. అప్పుడు నా జీతం రూ.3900ఉండేది. క్రమక్రమంగా జీతాలు పెరుగుతూ వచ్చాయి. పదోన్నతి పొందిన తర్వాత నా జీతం ప్రస్తుతం రూ.40వేలు ఉంది.

- స్వర్ణలత, డిస్ట్రిక్ట్‌ప్రోగ్రాం మేనేజర్, డీఆర్‌డీఏ

చదువుతో పాటు కరాటేలోనూ రాణించాలి

మందమర్రిరూరల్: విద్యార్థులు చదువుతో పాటు కరాటేలోనూ రాణించాలని ఏరియా జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. మందమర్రి ఏరియాలోని సీఐఎస్ఎఫ్ క్యాంపస్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఆల్ స్టైల్స్ ఫస్ట్ ఓపెన్ ఇన్విటేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్–2023 పోటీలను ప్రారంభించారు. అనంతరం జీఎం మాట్లాడుతూ కరాటే నేర్చుకోవడం వల్ల ఆత్మస్థైర్యంతో పాటు శరీర ధారుడ్యం పెరుగుతుందన్నారు. విద్యార్థుల పేరెంట్స్ ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో పోటీల నిర్వాహకులు శ్రీనివాస్, సందీప్, బీఆర్ఎస్ అనుబంధ సంఘాల నాయకులు, క్రీడాభిమానులు, క్రీడాకారులు ఉన్నారు.



కరాటే పోటీలు ప్రారంభిస్తున్న జీఎం శ్రీనివాస్

ఆదివాసీ తోటి సేవాసంఘం జిల్లా కమిటీ ఎన్నిక

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని చార్వకట్రస్టు భవన్‌లో ఆదివారం ఆదివాసీ తోటి సేవాసంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వల్క చిలుకయ్య, ప్రధాన కార్యదర్శిగా కుర్సింగ వెంకటేష్, ఉపాధ్యక్షులుగా ఆత్రం వెంకట్రాజం, శెడ్మకి మహేష్, మర్సకోల సుశీల, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కుడ్మెత తిరుపతి, గౌరవ అధ్యక్షుడిగా ఆత్రం రవీందర్, కోశాధికారిగా మర్సకోల లక్ష్మణ్, కార్యదర్శులుగా కుడ్మెత ప్రభాకర్, కొడప ప్రభాకర్, ఆత్రం లక్ష్మీనారాయణ, కుడ్మెత శ్రీనివాస్, గౌరవ సలహాదారులుగా మర్సకోల గోపాల్, కుడ్మెత రాజేశ్వర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



సభ్యులతో సంఘం నాయకులు

నియామకం



కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న సభ్యులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో మంచిర్యాల ప్లంబర్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా పొట్టాల మల్లేష్, ఉపాధ్యక్షుడిగా సీహెచ్ రాజ్‌కుమార్, కోశాధికారిగా తోకల అంజిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ప్లంబర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


చేపలు చిక్కేనా..?

మండలంలోని చెల్కగూడ చింతకుంట చెరువులో నీళ్లు పూర్తిగా అడుగంటాయి. చివరకు మిగిలిన బురద నీటిలో ఆదివారం స్థానిక యువకులు చేపలు పడతూ దర్శనమివ్వగా 'సాక్షి' కెమెరా క్లిక్ మనిపించింది.

- దండేపల్లి



అటెన్షన్ ప్లీజ్..



కంచె కరువు.. ప్రమాదానికి నెలవు

భీమారం: మండలంలోని పోలంపల్లి గ్రామపంచాయతీ పరిధి తాళ్లగూడెంలోని ప్రధాన రహదారి పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చినా, వాటికి రక్షణ కంచే ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదకరంగా ఉంది. చేతికందే ఎత్తులో ఉండటంతో ప్రమాదవశాత్తు ఎవరైనా తాకినా ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. గతంలో తాళ్లగూడెంలో సెల్‌ఫోన్ మాట్లాడుతూ వచ్చి ట్రాన్స్‌ఫార్మర్‌కి తాకి ఒకరు మరణించినట్లు గుర్తుచేశారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి రక్షణకంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సంబంధిత అధికారి: కుమారస్వామి, విద్యుత్ శాఖ ఏఈ, భీమారం

ఫోన్ నెంబర్:79016 78167

అలరించిన వార్షికోత్సవం

లక్సెట్టిపేట: స్థానిక ట్రినిటీ ఉన్నత పాఠశాలలో శనివారం రాత్రి నిర్వహించిన వేడుకలు అలరించాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ బిజ్జు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఇటీవల పాఠశాలలో నిర్వహించిన సైన్స్‌ఫెయిర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో లక్సెట్టిపేట మున్సిపల్ చైర్మన్ కాంతయ్య, సీఐ కరీముల్లాఖాన్, మున్సిపల్ వైస్‌చైర్మన్ శ్రీనివాస్, కౌన్సిలర్ సురేష్, పోషకులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



బహుమతులతో విద్యార్థులు

హమార ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలి

లక్సెట్టిపేట: అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమార ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని లక్సెట్టిపేట అంబేద్కర్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. హమార ప్రసాద్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు దేశద్రోహి కేసు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు నర్సయ్య, లింగన్న, నారాయణ, మహేందర్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదు చేస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు

చెక్కు అందజేత

మందమర్రిరూరల్: మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన సెగ్యం విష్ణు అనే లబ్ధిదారుడికి ప్రభుత్వం ద్వారా వచ్చిన రూ.60వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆదివారం జెడ్పీటీసీ వేల్పుల రవి అందించారు.